సాక్షి ప్రకాశం

గురువారం । 31 । జూలై । 2025



రెంటు బడి.. వంటబడి!

ప్రభుత్వ పాఠశాలలకు పేద విద్యార్థులను క్రమంగా దూరం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

- 8లో..



మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలి

స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లుల పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంతాన సాఫల్య కేంద్రాలు నిబంధనలు పాటించాలి

- ఫర్టిలిటీ సెంటర్లను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



సరోగసి వైద్యశాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లను నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఏఆర్‌టీ, సరోగసీ సెంటర్లు ప్రతినెలా 5వ తేదీలోపు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఏఆర్‌టీ, సరోగసి చట్టం కింద రిజిస్టరైన ఆస్పత్రులను బుధవారం జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హత కలిగిన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారా లేదా అని పరిశీలించారు. నిర్దేశించిన వైద్య పరికరాలు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. వివిధ ఆసుపత్రుల రికార్డులను పరిశీలించి చూశారు. వైద్యశాలలో లభిస్తున్న సేవలు, వాటి ఫీజుల వివరాలు రోగులకు అర్థమయ్యే భాషలో ప్రదర్శించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన సమాచారం ప్రకారం సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఏదైనా మార్పులు చేర్పులు చేస్తే వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో ఎవరైనా సరే రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రి, ల్యాబరేటరీ, డయాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలని చెప్పారు. వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలపై 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఆగస్టు 5వ తేదీ నుంచి 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలు, వారికి రావాల్సిన బకాయిలపై చర్చించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలల పాటు జరిగే కార్యక్రమంలో వారానికి ఒక సమస్యను లేవనెత్తుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, రామన వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు కోశాధికారి రంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూర్ శ్రీనివాస్‌రావు, కోశాధికారి ఏసురత్నం, తాలూకా అధ్యక్షుడు సురేష్, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.281.52 కోట్ల రాయితీల మంజూరు


ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా నెలకొల్పిన పరిశ్రమలకు రాయితీ కింద రూ.281.52 కోట్లు మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ప్రకాశం భవనంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం డీఐఈపీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 104 పరిశ్రమలకు చెందిన క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసిన వాటికి ఎస్ఎల్ఏ సమయం వరకు వేచి ఉండకుండా త్వరితగతిన మంజూరు చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించామని తెలిపారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

ఒంగోలు వన్‌టౌన్: నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ, సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాల్లో పూర్తి ఉచిత వసతితో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 8 నెలల నుంచి 10 నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి రెండేళ్ల క్లినికల్ అనుభవం, జీఎన్ఎం నర్సింగ్ చేసిన వారికి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. 8 నెలల నుంచి 10 నెలల శిక్షణలో జర్మన్ లాంగ్వేజ్ బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. వీసా, విమాన టికెట్ ఖర్చులు ఉద్యోగం ఇచ్చే కంపెనీలు భరిస్తాయన్నారు. రూ.2,40,000 నుంచి రూ.3,10,000 వరకు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు 9988853335, 8712655686 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చెల్లని చెక్కులు.. ఉపాధి బీటలు!

బీసీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది..ఈ మాటలు సీఎం చంద్రబాబు దగ్గర నుంచి కిందిస్థాయి నాయకులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధికి పెట్టపీట వేస్తున్నామన్న కూటమి నేతల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి సందర్భంగా మంత్రులు, జిల్లా అధికారులు మెగా మేళా నిర్వహించి 617 మందికి చెక్కులు పంపిణీ చేశారు. మూడు నెలలు దాటినా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో ఒక్కటంటే ఒక్క యూనిట్ ప్రారంభం కాలేదు. దీనిపై బీసీ సంఘాలు మండిపడుతున్నాయి.



- మెగా రుణమేళా పేరుతో నిరుద్యోగులను దగా
- బీసీ సాధికారిత పేరుతో బడుగుల చెవిలో కూటమి పూలు
- నిర్దేశిత లక్ష్యానికి చేరుకోకుండానే హడావుడి చేసిన అధికారులు
- 2069 యూనిట్లు లక్ష్యం కాగా, 1071 యూనిట్లకు అనుమతులు
- పూలే జయంతి రోజున మంత్రుల చేతుల మీదుగా 617 మందికి చెక్కులు పంపిణీ
- మ్యాచింగ్ నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- మండిపడుతున్న బీసీ సంఘాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఇతర అగ్రవర్ణ నిరుపేదలకు జీవనోపాధి కల్పిస్తామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేసింది. 50 శాతం రాయితీ రుణాలంటూ ఊదరగొట్టింది. దరఖాస్తు చేసుకోవడమే తరువాయి.. అందరికీ సబ్సిడీ రుణాలు అంటూ హంగామా చేశారు. వీరి మాటలు నిజమని నమ్మి భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి, ఏప్రిల్ 11వ తేదీ వైద్యారోగ్య శాఖ మంత్రి, డోలా బాలవీరాంజనేయస్వామి చేతుల మీదుగా రుణాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు. రుణాలు వచ్చేశాయని లబ్ధిదారులు సంబరపడ్డారు. నెలలు గడుస్తున్నా బ్యాంకులో రుణాల తాలూకు డబ్బులు పడకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. దీనిపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 2069 యూనిట్లకుగానూ 49.65 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పుకుంది. ఇప్పటి వరకూ 50 శాతం మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేసింది.

మెగా పేరుతో దగా...

పూలే జయంతి సందర్భంగా మెగా మేళా నిర్వహించి దగా చేసిందని బీసీ నేతలు మండిపడుతున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగానూ 2069 యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. కార్యాచరణలో మాత్రం కేవలం 647 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేసింది. ఇందుకోసం నెలల తరబడి నానా హంగామా చేసింది. బీసీలకు రుణాలివ్వనున్నట్లు సానుకూల మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువకులలో ఎన్నో ఆశలు కల్పించింది. మెగా మేళాలో కూడా అత్తెసరుగా యూనిట్లు మంజూరు చేసింది. బీసీలకు 1219 యూనిట్లను లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ 441 యూనిట్లను మాత్రమే మంజూరు చేసింది. అందులో 24.68 కోట్ల రూపాయలకుగానూ కేవలం 11.03 కోట్ల రూపాయలకు అగ్రవర్ణ నిరుపేదలైన ఈడబ్ల్యూఎస్ వారికి చెందిన 568 యూనిట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పుకుంది. కానీ, ఆచరణలో 157 యూనిట్లకు మాత్రమే అనుమతిచ్చింది. ఇందుకుగానూ 15.17 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకున్న కూటమి పాలకులు వాస్తవానికి 3.93 కోట్ల రూపాయలకు మాత్రమే లబ్ధిదారులకు చెక్కు అందించింది. కాపుల జీవితాలు మార్చివేస్తున్నట్లు గొప్పగా ఊదరగొట్టిన కూటమి పాలకులు వారి కోసం కేవలం 188 యూనిట్లు కేటాయించడం గమనార్హం. అదైనా సరే.. పూర్తిగా ఇచ్చారా అంటే లేదు. కేవలం 44 యూనిట్లు మంజూరు చేసి కాపులకు నమ్మక ద్రోహం చేసిందని విమర్శలు వినిపిస్తున్నాయి. కాపుల రుణాల కోసం 6.32 కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసిన రాష్ట్ర ప్రభుత్వం వారిచేతికిచ్చింది కేవలం 1.10 కోట్ల రూపాయలు మాత్రమే. ఇక, కాపు ఎంఎస్ఎంఈలకు పూర్తిగా చెవిలో పూలు పెట్టిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం 3 యూనిట్లు కేటాయించిన కూటమి పాలకులు కనీసం ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయకుండా చేతులెత్తేశారు. అసలు కాపు ఎంఎస్ఎంఈలకు కేటాయించిన నిధులు కూడా చాలా తక్కువగా ఉన్నాయన్న అసంతృప్తి వ్యక్తమయింది. దీని కోసం 75 లక్షల రూపాయలు కేటాయించడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పవచ్చు. ఇక మేదర, కుమ్మరి, శాలివాహనులకు 91 యూనిట్లు కేటాయించి కేవలం 5 మందికి మాత్రమే రుణం మంజూరు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీరికి 2.73 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పుకున్న కూటమి పాలకులు చేతికిచ్చింది కేవలం 15 లక్షల రూపాయలు మాత్రమే. మొత్తం 49.65 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకున్న ప్రభుత్వం 16.77 కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేసింది.

వంద రోజులు గడుస్తున్నా దిక్కు లేదు...

బీసీలు, అగ్రవర్ణ పేదలకు రుణాల పండుగ అంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేసుకున్న కూటమి పాలకులు నిజానికి వారికి నమ్మక ద్రోహం చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులో అట్టహాసంగా రుణమేళా నిర్వహించిన పాలకులు లబ్ధిదారుల చేతికి చెక్కులిచ్చి పంపించారు. చెక్కులు పంపిణీ చేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రుణం తాలూకు నగదు బ్యాంకులో జమకాలేదని వాపోతున్నారు. ఇక రుణం మంజూరైంది కదా అని కొంత మంది యువకులు వ్యాపారానికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. అప్పులు చేసి అడ్వాన్సులిచ్చారు. ఇప్పటికీ రుణం చేతికి రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని కొందరు నిరుద్యోగ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు రుణం ఎప్పుడు చేతికి వస్తుందో చెప్పాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చెల్లని చెక్కులిచ్చి తమను మోసం చేశారని కూటమి ప్రభుత్వం మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తమ్ముళ్లకే బ్యాంకర్లు గ్రీన్‌సిగ్నల్...

ఈ రుణాలన్నీ బ్యాంకు లింకేజీ రుణాలే. బ్యాంకర్లు అనుమతిచ్చిన వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది. అయితే అధికార పార్టీ నేతల నుంచి అధికారులకు ఒక లిస్టు పంపించినట్లు సమాచారం. వారికి మాత్రమే బ్యాంకర్లు అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. రుణాల కోసం నేరుగా దరఖాస్తు చేసుకున్న వారికి మొండిచేయి చూపినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం నేటికీ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో మెగా రుణమేళాలో ఇచ్చిన చెక్కులు చెల్లని కాగితాలుగా మిగిలిపోయాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

బీసీ స్వయం ఉపాధి రుణాలు ఇలా..

బీసీ స్వయం ఉపాధి రుణాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బీసీలతో పాటు ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పింది. బీసీలకు ఫిష్ ఫార్మింగ్, వాటర్ బాటిల్స్ రీసైక్లింగ్, ఫ్లైయాష్ బ్రిక్, ప్లంబింగ్, ఎల్ఈడీ బల్బుల అసెంబ్లింగ్ యూనిట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, మూడు చక్రాల ఆటో, గూడ్స్ సరఫరా చేసే ట్రక్, నాలుగు చక్రాల ఆటో మొబైల్, కార్ వాష్, బేకరీలు, మెడికల్ ల్యాబ్స్, బ్యూటీ పార్లర్, వంటి వాటిని ఏర్పాటు చేసుకునేలా యూనిట్లను నిర్ణయించింది. స్లాబ్–1లో రూ.2 లక్షల వరకూ, స్లాబ్–2లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ, స్లాబ్–3లో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో మిగిలిన నగదును బ్యాంక్ రుణం ద్వారా అందిస్తామని పేర్కొంది.

ప్రజలను మోసం చేయడంలో బాబు దిట్ట

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: ప్రజలను నమ్మించి మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్టని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని శానంపూడిలో బుధవారం రాత్రి పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, పార్టీ గ్రామ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఒక్క హామీ సక్రమంగా అమలు చేయటం లేదని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి, మహాశక్తి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం కూడా అరకొరగా ఇచ్చారని, అదేమంటే కేంద్రం ఈ పథకానికి ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదని చెబుతున్నారని ధ్వజమెత్తారు. పథకాలు అమలు చేయమంటే అన్ని అమలు చేశామని చెబుతున్నారని, లేకపోతే మీ నాలుక మందం అని అంటున్నారని, నాలుక మందమో, మీ తోలు మందమో ప్రజలే తేలుస్తారని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగం ఇచ్చిన వ్యక్తిగత హక్కులతో సమావేశం ఏర్పాటు చేస్తే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని, ఇది అంబేడ్కర్ రాజ్యాంగమా లేక రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారా..అని సురేష్ ప్రశ్నించారు. కూటమి అరాచకాలు రాసేందుకు ఎన్ని పుస్తకాలైనా సరిపోవని, కంప్యూటర్ ఒక్కటే సరిపోతుందన్నారు.

లేని శాఖకు మంత్రి స్వామి

వలంటీర్ వ్యవస్థను రద్దు చేసినా నేటికీ స్వామి ఆ శాఖకు మంత్రిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. వలంటీర్లు ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటికి తెచ్చి ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వారి గౌరవ వేతనం రూ.5 వేల నుంచి 10 వేలకు పెంచుతానని చెప్పి ఇప్పుడు ఆ వ్యవస్థనే రద్దు చేసిందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, బియ్యం మాఫియా యథేచ్ఛగా సాగుతోందని, బియ్యం నుంచి ప్రతి నెలా మంత్రి స్వామికి రూ.25 లక్షల ముడుపులు ముడుతున్నాయని ఆరోపించారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ బ్రహ్మయ్య, మాదాల శంకర్, ఆర్.అంకయ్య, బి.బుజ్జి, ఏ.దత్తు, ఎం.వేణు, బి.మురళి, ఎన్.బాలయ్య, బి.ప్రభాకర్, కె.పోలిరాజు, కె.భాస్కర్, వి.శ్రీహరి, ఆర్.వెంకటప్రసాద్, ఎస్.వీరయ్య, ఎన్.బాలకోటయ్య, షేక్ సుల్తాన్, కూనం నరేంద్రరెడ్డి, సుదర్శి వెంకట్రావు, యనమల మాధవి, రాపూరి ప్రభావతి, పఠాన్ రియాజ్, షేక్ మహమ్మద్ బాషా, షేక్ సలీం, గాదంశెట్టి గుప్తా, సోమిశెట్టి సురేష్, చుక్కా కిరణ్ కుమార్, మిడసల అశోక్, గొల్లపోతు గోవర్ధన్, కోమిట్ల వెంకారెడ్డి, షేక్ అల్లాభక్షు, షేక్ కరీం, బుజ్జమ్మ, షేక్ నౌషాద్, గోళ్లమూడి అశోక్‌రెడ్డి, బల్లెల ప్రభాకరరెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి, పాల్, తాతయ్య, విజయ్, నరేష్, పున్నయ్య, సాయికోటి, పి.శ్రీనివాసులరెడ్డి, చొప్పర శివ, పాకనాటి రమణారెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.

కొండపి పంచాయతీకి నోటిఫికేషన్ విడుదల

కొండపి:

కొండపి పంచాయతీకి ఎన్నికల అధికారి రవిబాబు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయినట్లు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేవారు రూ.1500 రుసుం చెల్లించాలన్నారు. వార్డు అభ్యర్థిగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ బీసీ అభ్యర్థులు రూ.500, ఓసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాలని తెలిపారు. తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. కొండపి పంచాయతీలో మొత్తం 14 వార్డులు, 668 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించి 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను పరిశీలిస్తామన్నారు. 4వ తేదీ తిరస్కరించిన నామినేషన్ల జాబితా విడుదల చేస్తామని, 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, 3 గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ అనివార్యమైతే 10వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట ఎన్నికలు వరకు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతామన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. ఒకవేళ రీ పోలింగ్ అవసరమైతే 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తామని వివరించారు.

జేసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



పెట్రోల్ బంకులో ఆయిల్ కొలతలు చూస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్:

జిల్లా వ్యాప్తంగా అధికారులు అన్ని సంస్థలు, గోడౌన్లు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోడౌన్లతో పాటు ఇతర సంస్థల్లో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని రెవెన్యూ విభాగానికి చెందిన ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఫైర్ డిపార్ట్‌మెంట్, రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు కూడా తనిఖీల్లో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి అధికారిలందరూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్స్, రైస్ మిల్లులు, బాణసంచా గోడౌన్లు, వాటర్ ఆర్ఓ ప్లాంట్లు, సినిమా హాళ్లు కూడా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పెట్రోలు బంకులు–38, గ్యాస్ ఏజెన్సీలు–9, రేషన్ షాపులు–50, ఎంఎల్ఎస్ పాయింట్స్–9, రైస్ మిల్లులు–6, బాణసంచా గోడౌన్లు–3, ఆర్ఓ ప్లాంట్లు–22, ఆర్టీసీ బస్టాండ్స్–2, హోటల్స్–2, ఐస్ క్రీమ్–1, ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్–1, సినిమా హాళ్లు–5 పరిశీలించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, రెవెన్యూ డివిజనల్ అధికార్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, జిల్లాలోని అందరూ తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో పాటు అన్ని విభాగాల అధికారులు ఉన్నారు.

పరిమితికి మించి సాగుచేస్తే నష్టాలే

- పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

పొదిలి: పొగాకు రైతులు అనుమతించిన దానికంటే అధికంగా సాగు చేస్తే నష్టపోయే అవకాశం ఉందని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వేలం సరళిని పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. రానున్న పంట కాలానికి బోర్డు అనుమతించిన 142 మిలియన్ కేజీల సాగుకు మాత్రమే రైతులు పరిమితం కావాలన్నారు. అంతర్జాతీయంగా దేశీయ పొగాకుకు బ్రెజిల్, జింబాబ్వే దేశాలు పోటీగా ఉండేవన్నారు. ప్రస్తుతం టాంజానియా, ఉగాండ, మలావి వంటి దేశాలు ఎఫ్‌సీవి పొగాకును సాగు చేసి దేశీయ పొగాకు మార్కెట్‌కు గట్టి పోటీ ఇస్తున్నాయని చెప్పారు. రానున్న పంట కాలానికి రైతులు అధిక ధరలకు బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకోవద్దని సూచించారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లలో ఏర్పడిన సంక్షోభాన్ని తొలగించేందుకు కంపెనీల యాజమాన్యాలు, ఉన్నతాధికారులతో మాట్లాడి లోగ్రేడ్ పొగాకును కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రైతులు మార్కెట్ సరళిని గమనించి బోర్డు అధికారులు, క్షేత్ర సిబ్బంది సూచించిన బేళ్లను మాత్రమే వేలం కేంద్రాలకు తీసుకురావాలని ఆయన కోరారు. అదనపు పంట అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తుందన్నారు. రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును అమ్ముకునే విధంగా పొగాకు బోర్డు చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యాపారులతో సమావేశమైన ఆయన.. లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. వేలం కేంద్రాలకు రైతులు లోగ్రేడ్ పొగాకు మాత్రమే తీసుకవస్తున్నందున కొనుగోలు చేయలేక పోతున్నామని వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వేలం అధికారి జి.గిరిరాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పేద విద్యార్థులను క్రమంగా దూరం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడుల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను సైతం పాలకులు ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలను ఉటంకించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆ దిశగా గత ఏడాది కాలంగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో అద్దె భవనాల్లో, పాఠశాల వంటగదుల్లో అరకొర వసతుల మధ్యే విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి. మనబడి నాడు–నేడు పనులకు మంగళం పాడిన కూటమి సర్కారు విద్యాభివృద్ధిపై కపట ప్రేమ చూపుతోందనేందుకు జిల్లాలోని పలు పాఠశాలలు తార్కాణంగా నిలుస్తున్నాయి.



రెంటు బడి.. ‘వంట’బడి!

సమస్యల మధ్య కొనసాగుతున్న బాలల విద్య

- మార్కాపురం సుందరయ్య కాలనీలో అద్దె ఇంట్లో మొండిగోడల మధ్య విద్యా బోధన
- కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు ఏపీ పాఠశాలలో వంట గదిలో తరగతులు
- బేస్తవారిపేటలో నిధులివ్వకపోవడంతో నిలిచిన ఉర్దూ పాఠశాల నిర్మాణం
- బెంచీలకు సైతం దిక్కులేక నేలపైనే కూర్చుంటున్న విద్యార్థులు
- కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూటమి సర్కారు నిర్లక్ష్యం

మొండి గోడలు.. చిల్లుల రేకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరయ్య కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నడుస్తోంది. ఈ కాలనీలో రోజూ పనికెళ్లి పొట్టపోసుకునే కూలీలే అధికం. వేల రూపాయల ఫీజులు కట్టి తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపలేక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు అందరూ మొగ్గుచూపుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 63 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 2 గదులు, వరండా మాత్రమే ఉన్నాయి. ఒక గదిలో వంటశాల ఉండగా, మరో గదిలో 1, 2 తరగతుల విద్యార్థులు కూర్చుంటున్నారు, వరండాలో 3, 4, 5, తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వరండా మొత్తం రేకులతో కప్పి ఉంది. రేకులు శిథిలావస్థకు చేరి చిల్లులు పడటంతో వర్షం కురిసినపుడు చిన్నారులు అవస్థలు పడుతున్నారు. నేలపై కూర్చోవడం, వీధి కుళాయి వద్ద నీరు తెచ్చుకుని తాగడం, ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవడం ఇక్కడి విద్యార్థులకు అలవాటు చేసినట్టుగా కనిపిస్తోంది. బయట నుంచి చూసేవారికి ఇక్కడ ఓ పాఠశాల ఉందని కూడా తెలియడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


శిథిలావస్థకు చేరి చిల్లులు పడిన రేకులు

ఆగిన నిర్మాణం.. దిక్కైన అద్దె భవనం


బేస్తవారిపేటలో అద్దె భవనంలో తరగతుల నిర్వహణ

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఏడేళ్ల క్రితం ఉరుద్దూ పాఠశాల రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో అధికారులు పడగొట్టారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నూతన గదులను బేస్‌మెంట్ వరకు నిర్మించిన కాంట్రాక్టర్ బిల్లులు రాలేదని మధ్యలోనే వదిలేశాడు. అప్పటి నుంచి పాఠశాలను ఇస్లాంపేటలో ఓ అద్దె ఇంట్లో నడుపుతున్నారు. ప్రతి నెలా ఉపాధ్యాయులే అద్దె, కరెంట్ బిల్లు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 28 మంది చదువుకుంటున్నారు. వసతులు లేకపోవడం, ఇరుకు గదుల్లో పాఠాలు చెప్పాల్సి రావడంతో కొందరు తల్లిదండ్రులు టీసీలు తీసుకుని వేరే పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. నాడు–నేడు మొదటి విడతలో ఎంపికైన ఈ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మించారు. బెంచీలు, స్మార్ట్ టెలివిజన్ ఇవ్వగా వసతి లేక మూలన పెట్టారు. అసంపూర్తి భవనానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


అసంపూర్తిగా నిలిచిన ఉర్దూ పాఠశాల భవన నిర్మాణం

ఇలాగైతే చదువు ‘వంట’బట్టేనా?

కొనకనమిట్ల: మండలంలోని బచ్చలకూరపాడు ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ఏపీ పాఠశాలలో నాడు–నేడు పనులు నిలిచిపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. రెండో విడతలో భాగంగా చేపట్టిన నూతన పాఠశాల నిర్మాణ పనులు శ్లాబ్ దశ వరకు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం రాగానే పనులు నిలిపేయడంతో పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న 24 మంది విద్యార్థులను వంట గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. అయితే ఇరుకు గదిలో కూర్చోలేక కొందరు పిల్లలు బయటకు వెళ్లి ఆటలాడుకుంటున్నారు. పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సర్వసభ్య సమావేశంలో ప్రశ్నిస్తున్నా అధికారులు స్పందించడం లేదని గ్రామ సర్పంచ్ మెట్టు రమణమ్మ, ఆమె భర్త వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి చెప్పారు. ఇదిలా ఉండగా ఇటీవల బదిలీలకు ముందు వరకు పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా ప్రస్తుతం ఒక్కరే పని చేస్తున్నారు. ×విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామ’ని ఎంఈఓ–2 నరసింహారావు చెప్పారు.


వంట గదిలో చదువుకుంటున్న పిల్లలు


మధ్యలో నిలిచిన పాఠశాల నిర్మాణం

వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం



సుందరయ్య కాలనీలోని మా పాఠశాల ఏమీ బాగోలేదు. నేలపైనే కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి. పాఠశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా కనీస వసతులు లేవు. రోజూ ఇబ్బందులు పడుతున్నాం. ఫర్నిచర్‌తో పాటు అధిక గదులున్న భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– ప్రభు కుమార్, 4వ తరగతి, మార్కాపురం

వర్షం కురిస్తే పాఠశాలలో



విద్యార్థులకు సరిపడా రూములు లేవు. ఉన్న రెండు రూముల్లో ఒకటి వంటశాలగా వాడుతున్నారు. మేము వరండాలో రేకుల కింద కూర్చుంటున్నాం. రేకులకు తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడటంతో వర్షం కురిసినప్పుడల్లా తరగతులు నిలిచిపోతున్నాయి. ఎండా కాలంలో ఆ రేకుల కింద కూర్చోలేకపోతున్నాం.

– రోహన్, 5వ తరగతి విద్యార్థి, మార్కాపురం

మా ఊరి బడిని బాగుచేయాలి



కాలనీ పిల్లలు చదువుకోవడానికి సరైన వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపే స్తోమత లేక ఊర్లో గవర్నమెంట్ బడికి పంపుతున్నాం. పిల్లలంతా ఇరుకుగా ఉన్న వంట గదిలో కూర్చోవడం చూస్తే బాధగా ఉంది. అధికారులు స్పందించి మా ఊరి బడిని బాగు చేయాలని కోరుతున్నాం.

– పెరికె రాణెమ్మ,బచ్చలకూరపాడు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన నాగరాజు

సింగరాయకొండ: అనారోగ్యం కారణాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ అంబేడ్కర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన నాగరాజు తన తల్లితో కలిసి ఊళ్లపాలెంలోని అంబేడ్కర్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఏడో తరగతి చదివిన నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి వస్తానని తల్లికి చెప్పి వెళ్లి ఊరి శివారులో వేపచెట్టుకు తాడుతో ఉరేసుకుని చనిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై బి.మహేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో మరో యువకుడు..


మృతి చెందిన ఆది

కొమరోలు: భార్యతో మనస్పర్థల కారణంగా భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొమరోలులోని సినిమా హాలు సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా పెద్దపాణ్యం మండలం తురకపల్లి గ్రామానికి చెందిన ఆది(29), సమ్రీన్ ప్రేమ వివాహం చేసుకుని గత 8 నెలలుగా కొమరోలులో నివాసం ఉంటున్నారు. ఆది తన స్నేహితుడు ఖాశింవలి ద్వారా ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య కొద్ది రోజులుగా మనస్పర్థలు పొడచూపాయి. బుధవారం రాత్రి మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఆది ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

స్కూటీ అదుపుతప్పి యువకుడి మృతి


పవన్ కళ్యాణ్ (ఫైల్)

కంభం: స్కూటీ అదుపుతప్పడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నకంభం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. మండలంలోని పెద్ద నల్లకాల్వ గ్రామానికి చెందిన నాగెళ్ల పవన్ కళ్యాణ్(27) కంభం వైజంక్షన్ వద్ద చాయ్ కేఫ్ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి చాయ్ కేఫ్ మూసి స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో చిన్నకంభం శివారులో పంట కాల్వ మూల మలుపు వద్ద స్కూటీ అదుపుతప్పింది. రాయికి తల తగలడంతో పవన్ కళ్యాణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జీవితంలో స్థిరపడతాడనుకున్న కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకెళ్తున్నట్లు బంధువులు తెలిపారు.

తీరానికి కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మహిళ మృతదేహం


ఈతముక్కల తీరంలో మహిళ మృతదేహం

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామం పల్లెపాలెం తీరానికి బుధవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకొచ్చింది. ఉదయం తీరానికి వెళ్లిన మత్స్యకారులు గోల్డెన్ హేచరీ ఎదురుగా మహిళ మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సుధాకర్‌బాబు పరిశీలించారు. మృతురాలి వయసు 30–35 ఏళ్ల మధ్య ఉండవచ్చని అంచనా. శరీరంపై దుస్తులు లేకపోవడంతో మహిళను హత్యాచారం చేశారా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతురాలి ఆచూకీ తెలిసినవారు 9121102126ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. సూక్ష్మరుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్ ప్లాన్), ఏసీఎల్‌పీ(యాన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్‌లీహుడ్ ప్లాన్) పథకాలు అమలు చేయడంతో పాటు లబ్ధిపొందేలా చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, వ్యవసాయ, పశు సంవర్ధక, సెరీకల్చర్, చేనేత–జౌళి శాఖ, పరిశ్రమలు, ఉద్యాన శాఖ, ఎల్‌డీఎం తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలకు ఏఏ శాఖల్లో సబ్సిడీ యూనిట్స్ అమలు చేస్తున్నారో అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని 45,297 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన 4,46,026 మందిలో పీ4 కార్యక్రమానికి ఎంపిక చేసిన వారికి ప్రాధ్యానత ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సెరీకల్చర్ అధికారి సంజయకుమార్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం రమేష్ కుమార్, జిల్లా చేనేత జౌళి శాఖాధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన డీఆర్‌డీఏ పీడీ నారాయణ

బేళ్ల తిరస్కరణతో రైతులకు తీవ్ర నష్టం

- పొగాకు కొనుగోళ్లకు ప్రభుత్వం రూ.వేయి కోట్లు ఇవ్వాలి
- రైతులు చస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శుల ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: పొగాకు కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేయి కోట్ల రూపాయలు కేటాయించాలని, వర్జీనియా పొగాకు క్వింటా రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జయంతి బాబు, పమిడి వెంకటరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాతావరణం సరిగా లేకపోవడంతో ఈ ఏడాది పొగాకు దిగుబడి సరిగా రాలేదన్నారు. నాణ్యత లేదని సాకులు చెబుతూ వ్యాపారులు కొర్రీలు పెట్టడంతోపాటు రోజూ వందల సంఖ్యలో బేళ్లను వెనక్కి పంపిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వేలం మొదలైన తరువాత వందలాది మంది రైతులు నాలుగుసార్లు బేళ్లను వెనక్కి తీసుకెళ్లారని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఒక్కో బ్యారన్‌కు ఐదారు లక్షల రూపాయల వరకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం శాపంగా మారకూడదని, ఇప్పటికే మిర్చి, నల్లబర్లీ పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. అయినా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పొగాకు రైతులకు మద్దతుగా గురువారం ఒంగోలులోని ఆర్‌ఎం కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తర్లుపాడు ఎంపీడీఓపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఒంగోలు సబర్బన్: స్వీపర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన తర్లుపాడు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ మాట్లాడుతూ.. తర్లుపాడు పోలీసులు ఎంపీడీఓపై కేసు నమోదు చేశారు కానీ ఇంతవరకు అరెస్ట్ చేయలేదన్నారు. ఎంపీడీఓపై చట్టపరంగా, శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ నాయకులు నేదరపల్లి జయరాజ్, రేణమాల మాధవ, రావినూతల వెంకటేష్, సూరపోగు మోజెష్, ఎనిబెర అబ్రహం, రోశయ్య తదితరులు ఉన్నారు.

పొలం వివాదంలో గొడ్డళ్లతో దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు


108లో క్షతగాత్రులు

కొమరోలు: పొలం విషయమై దాయాదుల మధ్య తలెత్తిన వివాదం తీవ్ర స్థాయి ఘర్షణకు దారితీసింది. ఈ సంఘటన కొమరోలు మండలంలోని గోనపల్లెలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. రెండు వర్గాలకు చెందిన వారు గొడ్డళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకోగా పెద్దినేని వెంకటేశ్వర్లు, పెద్దినేని శేఖర్, వసంత, రమణయ్య, లక్ష్మీదేవి, చంద్రయ్యకు గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లుగా ఎస్‌హెచ్‌ఓ నారాయణ తెలిపారు.

పీఆర్సీ లేదు.. బకాయిల్లేవు

- బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు



మాట్లాడుతున్న బీటీఏ నాయకులు

ఒంగోలు సిటీ: బహుజన ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణే బహుజన టీచర్స్ అసోసియేషన్ లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు పేర్కొన్నారు. బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ 25వ ఆవిర్భావ సదస్సును స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. పర్రె వెంకటరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేయకుండా, బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో బహుజనుల హక్కులు కాపాడటంతో బీటీఏ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ.. యాప్‌ల భారం తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంకా ఎక్కువ చేయడం తగదని అన్నారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పారాబత్తిన జాల రామయ్య మద్దిరాల శరత్ చంద్రబాబు, పల్లె తిరుపతిస్వామి, కొండమూరి కొండలరాయుడు, చెక్క కోటేశ్వరరావు, మిర్యాల వెలుగొండయ్య, గాలిమోటు భాస్కరరావు, బొంత కళ్యాణ్, టి.రాజ్ కుమార్, కొప్పోలు కిషోర్, నన్నేసాని భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక తరగతులు విజయవంతం చేయాలి

ఒంగోలు టౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేందుకు, మూఢ నమ్మకాలను పారదోలేందుకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు నంద్యాలలో నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆవరణలో శిక్షణా తరగతుల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిసింద్రి బాబు, శ్యామ్, సచిన్, హరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగకు సంకెళ్లు!

- అదుపులోకి తీసుకున్న జీఆర్పీ పోలీసులు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ షేక్ మౌలా షరీఫ్

ఒంగోలు టౌన్: రైలులో ప్రయాణిస్తున్న వారి చేతుల్లోని సెల్ ఫోన్లను లాక్కుని నిమిషాల్లో మాయమయ్యే దొంగను ఒంగోలు జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ పోలీసు స్టేషన్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ షేక్ మౌలా షరీఫ్ వివరాలు వెల్లడించారు. ఒంగోలు నగరంలోని భాగ్యనగర్ 4వ లైనుకు చెందిన షేక్ రఫీ గత కొంతకాలంగా రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. రైలు గేటు వద్ద కూర్చుని సెల్‌ఫోన్ చూసే ప్రయాణికుల చేతులపై కర్రతో కొట్టి కిందపడిన ఫోన్లను తీసుకుని ఉడాయించేవాడు. నిందితుడి మీద పలు స్టేషన్లలో 4 కేసులు, ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సస్పెక్ట్ షీట్ నమోదై ఉన్నాయి. ఇతని కదలికలపై నిఘా ఉంచిన జీఆర్పీ పోలీసులు ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.50 వేల విలువైన ఒప్పో మొబైల్ ఒకటి, రియల్ మీ ఫోన్లు 3, శాంసంగ్ ఫోన్ ఒకటి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో కృషి చేసిన జీఆర్పీ ఎస్సై మధుసూదన్‌రావు, సిబ్బందిని సీఐ మౌలా షరీఫ్ అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ వృక్ష జాతుల్లో రారాజు అయినటువంటి ఎర్రచందనం మన ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని జిల్లాల్లో పండే ఎర్రచందనం అరుదైన పంట అటువంటి ఎర్రచందనాన్ని మన ప్రకాశం జిల్లాలో 22 సెంట్లు 90 మొక్కలతో ఫామ్ లాండ్స్‌గా అందిస్తున్నారు. 99088 22077 [SCA25006844]

HOUSE FOR SALE

■ ఒంగోలు టౌన్ మంగమూరుడొంక ఆశ్రమం దగ్గర 2BHK. ఇండిపెండెంట్ హౌసెస్–2, 2BHK అపార్ట్మెంట్ ఫ్లాట్స్ అమ్మబడును. సె.63029 67236. [SCA25006797]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071 [G-677]

Wanted

■ ఒంగోలు వల్లూరమ్మ గుడివద్ద ఇంజనీరింగ్ కాలేజీకి 3 సం॥ అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను డ్యూటీ: 12 గం॥ జీ: 13400/- PF, ESI తో రూ+భోజనం ఫ్రీ ✆ 83318 76264 [SCA25006813]

■ RR ఇన్‌స్టిట్యూషన్స్ : ఓపెన్ & రెగ్యులర్ కోర్సులు ఇంటర్, డిగ్రీ, PG, నర్సింగ్, ఫార్మసీ, పారామెడికల్, ఫిజియో థెరపీలకు మార్కాపురం, గుంటూరు, ఒంగోలులలో అడ్మిషన్లు కలవు. సెల్: 9705191240 (లేడీ టెలికాలర్స్ కావలెను) [SCA25006830]

■ ఒంగోలులోని శ్రీరత్నశ్రీ మెడికల్ షాపు నందు వర్క్ చేయుటకు అనుభవం కలిగిన or న్యూ Boys కావలెను. సంప్ర: సెల్:99665 81651. [SCA25006791]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02762